# ఈశాని

చతురే కీత



విశాఖ ఎక్స్‌ప్రెస్ విజయనగరం ప్లాట్‌ఫారం విడిచిపెట్టింది.

పరుగున వెళ్లి నడుస్తున్న రైలెక్కాడు ఫణి. ఫుట్‌పాత్ వద్ద నలుగురైదుగురు నిలబడి వుంటే వాళ్లని తోసుకుంటూ లోపల కెళ్లాడు. భుజాన వేలాడుతున్న బ్యాగ్ తీసి పై బెర్తు మీద పెట్టి ఫ్యాంట్ జేబు తడుచుమున్నాడోమారు. చేతికి పర్సు తగలకపోవడంతో అతగాడికి ముచ్చెమటలు పోసాయి. కంగారుగా ఒకటికి రెండుసార్లు జేబుల్లోకి చేతులు పోనిచ్చాడు. ఉహుం... పర్సు జాడే లేదు. దిగిపోదామనుకుంటే అప్పటికే బండి మాంచి స్పీడందుకుంది. ఏం చేయాలో తోచక పిచ్చి చూపులు చూడసాగాడు.

అతడి అవస్థను గమనించి "ఏంటి బాబు అలా వెతుక్కుంటున్నావు. డబ్బు గాని పోయిందా?" అడిగాడు దళసరి కళ్లద్దాలు ధరించిన ఓ పెద్దాయన.

"ఔనండి, నా పర్సు ఎవరో కొట్టేసారు. అందులో ఐదొందలున్నాయి" అన్నాడు ఫణి.

భయం వల్ల అతడి గొంతు వణుకుతోంది. "అయ్యో పావం, ఇంతకీ నువ్వెక్కడికెళ్ళాలి?" అడిగాడు పక్కనే నిలబడ్డ చారల షర్టు యువకుడు అతడిమీద సానుభూతి కురిపిస్తూ.

"విజయవాడలో నేనో ఇంటర్వ్యూకి అటెండవ్వాలి. నాన్నగారు అప్పుచేసి మరీ దారి ఖర్చులకు డబ్బిచ్చారు. ఇప్పుడు నాకేం చేయాలో పాలుపోవడం లేదు."

అతడి స్థితికి తోటి ప్రయాణికులు జాలి పడ్డారు.

"ఇంతకీ నువ్వు పర్సు ఎక్కడ పోగొట్టుకున్నావో ఏమిటో" అన్నాడు కళ్ళద్దాలాయన.

"స్టేషన్ కొచ్చేటప్పుడు పర్సు జేబులోనే ఉందండి. గేటు వద్ద జనాన్ని తోసుకుంటూ లోపల కొచ్చేటప్పుడే పోయి వుంటుందను కుంటున్నాను".

ఫణి మాటలకు "సరే ఇక్కడున్న పది మందిని జేబులు చూపించమందాం. దొంగ ఎవరో దొరికి పోతాడు. అందుకు మీరంతా సహకరించాలి" అన్నాడు తోటి ప్రయాణికులతో ఆ పెద్దమనిషి.

"తప్పకుండా అలా చేస్తేనే బావుటుంది" అన్నారంతా.

"మీ పిచ్చిగాని డబ్బు కాజేసిన వ్యక్తి ఇంకా పర్సు జేబులో పెట్టుకుని ఇక్కడే కూర్చుంటాడటండీ! ఈ పాటికది ఎన్ని చేతులు మారిపోయి ఉంటుందో! అందర్నీ సోదాచేసి వెర్రి మొహం వేసే బదులు తలోకరు తలో పది ఆ కుర్రాడికి సహాయపడితే పోలా? ముందుగా నేనే బోణీ చేస్తాను" అంటూ జేబులో నుంచి వంద కాగితం తీసి ఫణి చేతిలో పెట్టబోయాడు.

"వద్దండీ. నా ఖర్మకి మీరేం చేస్తారు? నా పాట్లేవో నేను పడతాను" డబ్బు తీసుకోవడానిక మోమాట పడ్డాడు ఫణి."

"పరవాలేదు తీస్కో ఇటువంటి పరిస్థితి నా తమ్ముడికే వస్తే చూస్తూ ఊరుకుంటానా, చెప్పు" అంటూ బలవంతంగా ఆ కాగితాన్ని అతడి షర్టు జేబులో కుక్కాడు చారలషర్టు వ్యక్తి.

"చిన్నవాడైనా అతగాడి ఈవిని విశేషంగా భావించాలి. ఈ వయసులో అంత గొప్ప గుణం ఎంతమందికి ఉంటుందంటారు" అంటూ అతన్ని వేనోళ్ళ కొనియాడారు. అంతేకాదు తలోకరు తలో పది, ఇరవై ఆ అబ్బాయికిచ్చారు.

"థ్యాంక్సండీ. మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను. దయచేసి మీ అడ్రస్ ఇవ్వండి ఇంటికి వెళ్ళగానే మీ డబ్బులు మీకు ఎమ్.ఒ. చేస్తాను" కృతజ్ఞతగా అన్నాడు ఫణి.

"అదేమిటయ్యా ఈ మాత్రానికే అంత ఇదైపోతున్నావ్. ఎదుటివాడు కష్టంలో

ఉన్నాడని తెలిసి ఆదుకోలేనివాడు నా దృష్టిలో మనిషే కాదు. వెధవది డబ్బుదేముంది. ఇవాళ వస్తుంది. రేపు పోతుంది. ఎప్పటికి నిలిచేది మన మంచి తనమే. విష్ యు బెస్టాఫ్ లక్" అంటూ ముందుకు కదిలాడు చారల షర్టు వ్యక్తి.

చేసిన ఉపకారానికి అందరికీ మరో మారు కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు ఫణి.

అయితే అతడి పర్సు చారల షర్టు వ్యక్తే కొట్టేసాడని, తనిఖీ చేస్తే ఎక్కడ పట్టుబడిపోతానో అన్న బెదురుతోనే అతడా సలహా ఇచ్చాడన్న సంగతి ఫణితో సహా అక్కడున్న వాళ్ళెవరికీ తెలీదు.

(మార్చి 2008 – చతుర మాసపత్రిక)